

# నిశాకన్య

ద్విభాష్యం రాజేశ్వరరావు

ప్రకృతి తనవిధినినిర్వర్తించి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని, చలితో వణికి

పోతున్న సుందరిలా వుంది। మేఘాలు తమపనిని నిర్వహిస్తూ ప్రయాణిస్తు

న్నాయ్. రాత్రి కురిసిన తేనె మంచు పచ్చగడ్డిమీద తెల్లగా ముత్యాల్లా మెరుస్తూ అందాన్ని నిర్వచిస్తోంది. గడ్డిచివుళ్ళు సిగ్గుతో ముకుళించుకొని ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాయ్!

కాలసర్పం పాపపుణ్యాల్ని మింగుకొని ముందుకు సాగిపోతున్నట్లు, కొండల్ని చుట్టుకొన్న పాములా వున్న మెలికలుతిరిగిన రోడ్డుని మింగుతూ బస్సు ముందుకు సాగిపోతోంది. రోడ్డుకు ఒక ప్రక్క ఎత్తైనకొండా, ఇంకొకవైపున అగాధమైనలోయా, స్వర్గనరకాల్లా నిల్చి వున్నాయి. రాత్రికురిసిన మంచుకు తార్థాణంగా కొండరాళ్ల తడిగా కన్పిస్తున్నాయ్. చల్లగాలి రివ్వున మొహానికి కొడుతూవుంటే నరాలు జివ్వున లాగుతున్నట్లున్నాయ్. ఆ బాధలోనే అనిర్వచనీయమైన అనుభూతి; ఆనందం. ఎంతసేపు చూసినా తనివితీరని, లోతందని లోయలు. వాటిలోకి తదేకంగా చూస్తూ వుంటే, పచ్చతనపు ముద్దతప్ప ఇంకేమీ కానరావటంలేదు. అవతలివైపు కొండ అంచున ప్రయాణించిన రోడ్డంతా మసగ్గా ఆ కొండరోడ్లని మేఘాలు తాకుతూ వుంటే వాటిలోంచే ప్రయాణించి వచ్చామా?' అనిపిస్తోంది.

అనంతగిరి ఎప్పుడో దాటిపోయింది. అది ఆ ప్రాంతాల్లోకల్లా ఎత్తైన ప్రదేశము. ఆ ఘాటురోడ్డుమీద నిలబడి ప్రకృతిని తిలకిస్తూవుంటే మనని మనం మర్చిపోతాం. ఆ ఆనందం మనసులో ముద్ర వేసుకొంది. బస్సు అరకులోయకు చేరువౌతున్నకొద్దీ ఆత్రుత హెచ్చవుతోంది. జీవితంలో మొటిదసారిగా ఇటువంటి ప్రదేశాల్ని చూడటం – మనసు ఏవో లోకాల్లో విహరిస్తున్నట్లు ఆహ్లాదంగా వుంది.

"ఏమిటో! రాణీగారు మధుర స్వప్నాల్ని కంటునట్టున్నారే! ఆ స్వప్నాల్లోని ప్రియుడు – రాకుమారుడు... ప్రవరుడు ... మన్మథుడు ... ఆ అదృష్టవంతుడు ఎవరో?" అంటూ జడ ట్టుకొని గట్టిగా లాగింది శైలజ.

"అబ్బ! ఉండవే. నువ్వు మరీను!" అంటూ జడ విదిలించుకొనేందుకు ప్రయత్నించాను.

స్నేహితురాండ్రందరూ గట్టిగా నవ్వుతున్నారు.

"ఉహూఁ! చెప్తేకాని వదలను. మేమందరం కలిసి ఇలా అరకులోయ పిక్నిక్‌కు బయలుదేరితే నువ్వు మాతో పాలుపంచుకోకుండా నీ ఊహానాధునితో విహరించటానికి ఈ శైలజ ఒప్పుకోదు." మూతి అదోలా పెట్టింది శైలజ.

మళ్ళీ అందరూ నవ్వారు.

"ఫో! పాడుపిల్లా!" అన్నా మెల్లిగా సిగ్గుతో.

"ఏమిటాలోచిస్తున్నావ్ రాజీ?" అంది భుజంమీద చెయ్యివేసి మెల్లగా రాస్తూ.

"శైలూ! పాములా మెలికలు తిరిగిన ఈ అందమైన రోడ్డు; గిలిగింతలు పెట్టే ఈ చల్లనిగాలి; కన్నులపండువగా పచ్చని చీర ధరించిన ఈ ప్రకృతి సుందరి; ఆమెను ఆనందంతో మెల్లిగా స్పృశిస్తున్న దూదిపింజల్లాంటి తెల్లని మేఘాలు; అగాధమైన లోయలు ఇవన్నీ చూస్తూంటే నీ కెలాగుంది?" అన్నాను ఆనందంగా.

శైలజ నా దగ్గరగా వంగి అంది: "అబ్బో! రాణిగారు కవిత్వంకూడా చెప్తున్నారే! ఇంకేం, ఒక్కొక్కటి అలా పుట్టుకొస్తాయిలే. అయితే ఈ ప్రకృతిని చూస్తూంటే నా కెలాగుందో చెప్పనా?"

"ఊఁ, చెప్పు."

"నువ్వు ఎమీ అనకూడదమ్మాయ్."

"అలాగేలే!" అన్నా సందేహిస్తూ.

"నిన్ను ముద్దుపెట్టుకోవాలనివుంది!" అంటూ వంగి గట్టిగా బుగ్గమీద ముద్దు పెట్టుకొంది.

"ఛీ! పాడుబుద్ధులన్నీ!" అంటూ వదిలించుకొన్నాను. వెనుక సీట్లోవాళ్ళు నవ్వుతూంటే చచ్చే సిగ్గనిపించింది.

కేరింతలతో, గోలతో సాగిపోతోంది బస్సు!

"రాధిక ఏదీ?" అన్నా, ఏదో ఒకటి మాట్లాడాలని.

"అదిగో, ఆ ముందుసీట్లో చూడు, ఎలా కూర్చుందో! అశోకవనంలో సీతలాగ. నా మీద అలిగి అక్కడికి వెళ్ళిపోయింది," అంటూ శైలజ వెనక్కు తిరిగి పార్వతితో కబుర్లలోకి దిగిపోయింది.

శైలు ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూ వుంటుంది వసపోసిన పిట్టలాగ.

రాధికవైపు చూశాను. నిశ్శబ్దంగా కూర్చొని ఈ ప్రపంచంతో సంబంధం లేనట్లు కిటికీలోంచి అవతలకు చూస్తోంది. నిన్నటినుండీ ఆమెను ప్రత్యేకంగా గమనిస్తున్నా. ఆమెలో పిక్నిక్‌కు వెళ్తున్నామన్న ఉత్సాహం, క్రొత్త ప్రదేశాల్ని చూస్తున్నామన్న ఆసక్తి కనబడలేదు. ఏదో నిర్వేదంగా ఆలోచిస్తోంది. ఆమె అలా ఎందుకు మారిపోయిందో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు!

నేనూ, శైలజా ఇంటరునుండి చదువుకున్నాం. మొదటనుంచీ ఇద్దరం ఒకటిగా వుండేవాళ్ళం. శైలు ఒట్టి బోళా మనిషి. ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూ, తుళ్ళుతూ, సరదాగా వుంటుంది. నిర్మలమైన మనస్సు ఆమెది. ఏదీ మనసులో దాచుకోదు. నేనంటే ఆమెకు అంతులేని అభిమానం. అప్పుడప్పుడు నాతో అంటూవుంటుంది :

"నువ్వు నా దురదృష్టంకొద్దీ ఆడదానివై పుట్టావుగాని, లేకపోతే పెళ్ళాడేద్దును సుమా!"

మేమిద్దరం ఇంటరు పూర్తిచేసి ఒకేసారి విశాఖపట్నం మెడికల్ కాలేజీలో

చేరాం. అక్కడ హాస్టల్సులో మరొక ఆమె మా రూమ్మేటుగా చేరింది. ఆమే కథానాయకురాలైన రాధిక.

*    *    *

ఈ కథకు నాయకురాలు రాధికే. ఈ కథను వ్రాయటం ఆమెగురించే. అయితే ఆమె ఈ కథ చదువుతుందని కాదు; ఆ ఆశ నాకు ఏకోశాన్నాలేదు. అయినా వ్రాయటం నా తృప్తికోసం. మనస్సులో రగుల్కొంటున్న బాధాగ్నిని చల్లార్చుకొనేందుకు. భగవంతుడు రాధికలాంటి మంచిబొమ్మను సృష్ఠించి దానితో ఎందుకు ఆటలాడతాడో తెలియదు. అందంలో ఆ సృష్ఠికర్తకు ఏ మాత్రం ఆనందమున్నా అది నా గుండెకు రంపపుకోతే అవుతుంది.


*    *    *

ఒక్క ముక్కలో చెప్పాలంటే రాధిక, శైలజకు పూర్తిగా వ్యతిరేకం. చాలా నిండైన మనిషి; తొణకదు; అవసరమైతేతప్ప నోరువిప్పి మాట్లాడదు. చాలా గంభీరంగా వుంటుంది. ఆమె దుస్తుల్లో, భాషలో నిరాడంబరం గోచరిస్తుంది. ఆకర్షణ లేకపోయినా ఆమెలో అందంవుంది. ఆమె కాలేజీలో చేరిన క్రొత్తలో అమెను 'చాలాగర్విష్ఠి' అన్నారు కొందరు. తరువాత 'యోగిని' అన్నారు. ఆమె ఎవ్వరేమన్నా చలించే మనిషికాదు. ఆమెకు కాలేజీలో ఎవరైనా స్నేహితులు ఉన్నారంటే అది నేనూ, శైలజా మాత్రమే; మిగిలినవాళ్ళతో ఎంతో అవసరమైతేతప్ప మాట్లాడదు.

శైలజ గలగలపారే సెలయేరైతే, రాధిక గంభీరముద్రదాల్చిన సముద్రం. ఒకరు దక్షిణధృవం, మరొకరు ఉత్తరధృవం. ఆ విభిన్న వైఖరిగల ఇద్దరితోనూ నాకు సాంగత్యం కల్గటం విచిత్రమే. రాధికను ఎవ్వరెలా అన్నా నేనుమాత్రం ఆమెకు నా హృదయంలో ప్రత్యేకస్థానం ఇస్తాను. దానికి కారణం ఆమె నిర్లిప్తతా, మంచితనం కావచ్చు. ఆమె ముఖంలో ఆనందం, ఆమె పెదాలపై చిరునవ్వు నేను చూసింది చాలా తక్కువసార్లేమో:

"రాధికా! ఎప్పుడూ మాట్లాడవు. చిరునవ్వయినా నవ్వవు! ఏం? నవరత్నాలు రాలిపోతే మేం ఏరుకుంటామనా?" అని శైలజ అంటే సమాధానంగా చిన్నగా నవ్వుతుంది రాధిక. ఆ నవ్వులో నవరత్నాలు రాలవు కాని నవరసాల్లో ఒకటయిన విషాదంమాత్రం మినుకుమినుకుమంటూ ద్యోతకమవుతుంది.

ప్రస్తుతం నాలుగవసంవత్సరం సాగుతోంది. గడిచిపోయిన మూడు సంవత్సరాలూ ఒడుదుడుకులు లేకుండా స్నేహితురాండ్ర సాంగత్యంతో హాయిగా గడిచిపోయాయి. నేను, శైలు, రాధిక ఎక్కడా అలిసిపోకుండా ఈదుకొస్తున్నాం. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్స




రముకూడా మా హాస్టలు పిక్నిక్ ఏర్పాటయింది. అందరి అభిప్రాయాలు సేకరించి అరకులోయ వెళ్ళటానికి నిశ్చయించారు. అరకులోయలోని ప్రశాంత ప్రకృతిని, అందాన్ని నాన్నగారు చెప్తుంటే వినటమే తప్ప చూడటం కుదరలేదు. అది ఇన్నాళ్ళకు ఫలిస్తున్నందుకు చాలా ఉత్సాహంగా వుంది.

ముందుగానే మూడు ప్రయివేటు బస్సుల్ని ఏర్పాటు చేసుకొన్నాం! రేపు పిక్నిక్ అనగా ముందురాత్రి వంట సామాను, ఇతర అవసర వస్తువులు కొంతమంది ముఖ్యుల్ని ఒక బస్సులో పంపేశాం. మిగిలినవాళ్ళం రెండు బస్సుల్లో తెల్లవారుఝామున బయలుదేరాం.

"నువ్వలాగే చూస్తూ కూర్చో! మేమందరం మళ్ళీ రాత్రి బస్సుఎక్కుతాం. అందరితో కలిసి పైజాగు వచ్చేద్దువుగాని;" అంటూ శైలజ గట్టిగా తట్టింది. అప్పుడు తెల్సింది బస్సు గమ్యం చేరిందని! బస్సులో అందరూ దిగేశారు అప్పుడే. నా మరపుకు నాకే సిగ్గనిపించింది. నవ్వుతూ శైలజతో బస్సు దిగిపోయాను. ట్రావెలర్సు బంగళా మా బసగా ఇచ్చారు. లోపలకి ప్రవేశించాను. లోపలంతా కోలహాలంగా వుంది. మైకులో చెవులు హోరెత్తించే పాటలు, స్నేహితురాండ్ర కొలాహలం, అంతా పెళ్ళిఇల్లులా వుంది. బంగళా పూర్తిగా కలయతిరిగాను. బంగళా బాగాఎత్తైన ప్రదేశంలో వుండటం వలన, చుట్టు ప్రక్కలవున్న స్థలాలన్నీ చాలాదూరం వరకూ బాగానే కన్పిస్తున్నాయ్.

మంచుతెరలు చాలామటుకు విడిపోయినా ఎండమాత్రం రాలేదు.

బంగళాకు వెనుకవైపున వంటపనులు సాగుతున్నాయి.

"ఒక్క ఐదు నిమిషాలు రాజీ! టిఫిన్, కాఫీ సిద్ధమైపోతుంది," అంది కమల.

"ఓహో! ఇక్కడ తమరు ఆధ్వర్యం వహించారా? అయితే మేం మధ్యాహ్నం భోజనాలు చేసినట్టే!" అంటూ నవ్వాను.

కమలకూడా నాతో శృతికల్పింది, "చూద్దువుగాని మన మజా!" అంటూ.

"రాధిక ఏదీ?" ఆమె బంగళా లోపల ఎక్కడా కన్పించకపోవటంతో కమలను అడిగాను.

"ఇప్పుడే ఇలా ప్రక్కకు వెళ్ళింది తువ్వాలు పట్టుకొని. 'పైప్' వద్దకు వెళ్ళిందేమో!" అంటూ కమల రాధిక వెళ్ళినవైపు చూపించింది.

నేను మౌనంగా అటువైపు వెళ్ళాను.

కొంచెం దూరంలో వేపచెట్టు, ప్రక్కనే పెద్దబండ. బండవానుకొని నించొని దిగువకు చూస్తోంది రాధిక. అక్కడనుంచి ఒకవైపున డి. బి. కె. రైల్వేవాళ్ళ ఆఫీసు బంగళాలు, గుడారాలు అంతా చిన్నవూరులా కన్పిస్తోంది. ఇంకొకవైపున మేం వచ్చినదారి, ప్రక్కనే చిన్నచిన్న పాకహోటళ్లు, కిళ్ళీషాపులు, కూరలబజారు, 'మాచ్‌ఖండ్' పోయే బస్సు అవుపిస్తున్నాయ్.

ఎత్తైన ప్రదేశం అవటం మూలాన్న చలిగాలి బాగా వీస్తోంది.

రివ్వున వీచేగాలికి ముంగురులు రేగి ముఖాన పడుతున్నా లెఖ్ఖచేయ్యకుండా మరో ప్రపంచంలో వున్నట్టు మ్లానవదనంతో ఎటో చూస్తున్న రాధికను చూస్తూంటే ఆదోలా అన్పించింది.

"ఏం రాధికా! ఇక్కడ నిలబడ్డావ్?" దగ్గరగా వెళ్తూ అన్నాను.

"అబ్బే! ఏంలేదు!" అంటూ తత్తరపాటుతో నావైపు తిరిగింది.

ఆమె ముఖము అంతా పాలిపోయి వుంది! కనుకొలకుల్లో అస్పష్టంగా కెంపుల్లాంటి బిందువులు జీరాడుతున్నాయి! ఆమె ముఖంలోకి చూస్తుంటే ఆమె బాధపడుతోందని తెలుసుకోటానికి ఎంతసేపో పట్టలేదు! నా అనుమానం గుర్తించింది కాబోలు - తువ్వాలుతో కళ్ళు ఒత్తుకొని ముఖానికి నవ్వుపూతల్ని పూసుకొంది!

కాని ఆ నవ్వులో కళ ఎక్కడనుంచి తెచ్చుకోగలదు!

"రాధికా! ఏమిటి ఆలోచిస్తున్నావ్?" గోముగా అడిగాను.

"ఏంలేదు! 'స్నానం ఎక్కడ చేద్దామా!' అని. అంతే!" అంది గాభరగా.

"ఎందుకు రాధికా, అలా కంగారు పడతావ్? నువ్వు ఏదో బాధపడుతున్నావని నాకు తెలుసు! కాని దాన్ని నువ్వు పూతల్తో కప్పి ఎందుకు నన్ను మోసగిస్తావ్! నిన్నటినుంచీ ఇలా వున్నావేం? నాతో చెప్పకూడదూ! అంతకానిదాన్నయ్యానా నేను."

"సారీ! రాజీ! అంతమాటనకు! అనవసరంగా నీ మనసు నొప్పించాను! పద

వెళ్ళి టిఫిన్ చేద్దాం!" అంటూ మాట మార్చి ముందుకు దారితీసింది. చేసేది లేక మౌనంగా ఆమెను అనుసరించాను.

కాలకృత్యాలు తీర్చుకొని టిఫిన్ ముగించాం.

బట్టలు మార్చుకుని బయటకు వెళ్ళ టానికి అందరూ సిద్ధమౌతున్నారు. నలుగురైదుగు రొకగుంపుగా బయలు దేరుతున్నారు.

శైలజ హడావుడిగా సుగుణని. ఫ్లారెన్సుని వెంటబెట్టుకొని వచ్చింది.

"రాణీగారూ! మేం ముగ్గురం 'ఆర్చెడాన్' (ఫలపరిశోధక కేంద్రం)కి వెళ్తున్నాము. మీరుకూడా వస్తారా?" అంటూ ప్రశ్నార్థకంగా నావైపు రాధికవైపు చూసింది

"అబ్బో! అప్పుడే ఇక్కడ ఏమేమిటున్నాయో కని పెట్టేశావే! 'కొలంబస్,' 'మార్కోపోలో' నీ దగ్గర ట్రయినింగు తీసుకొనివుంటారు ముందు జన్మల్లో," అన్నాను నవ్వుతూ.

"అరె! నువ్వుకూడా ఛలోక్తులు విసురుతున్నావే!" గలగలా నవ్వేసింది శైలజ.

"ఏం! రాధికా! వెళ్దామా?" అన్నా రాధికవైపు చూస్తూ.

"నేను అప్పుడే చూశాను: మళ్ళీ ఎందుకులెద్దూ అంతదూరం!"

అందరికీ ఆశ్చర్యం వేసింది!

"అప్పుడే ఎలా చూశావ్? ఇంతకుముం దెప్పుడయినా నువ్వు ఇక్కడకు వచ్చావా?" అన్నాను.

"ఊఁ! మెడిసన్‌లో చేరేముందు రెండుసార్లు వచ్చాను."అంది నిర్లిప్తంగా.

"ఇంకా చెప్పవేం! మాకు మార్గ దర్శకురాలివన్నమాట. రా!" అంటూ, బలవంతం చేసింది శైలజ.

"సరే!"అంటూ మౌనంగా బయలు దేరింది రాధిక.

ఐదుగురం కలిసి మెల్లిగా నడక ప్రారంభించాం. బంగళానుండి రోడ్డును చేరుకున్నాం. అక్కడ కమలాపళ్ళు కొని ఒలుస్తూ మెల్లిగా నడకసాగించాం. పళ్ళు రాత్రి మంచులో వుండటంవలన చల్లగా వున్నాయి. చలి ఇంకా తగ్గలేదు. శైలజ కబుర్లతో దూరం తెలియకుండా నడుస్తున్నాం.

రాధిక నిర్లిప్తతను చూస్తూంటే చాలా ఆశ్చర్యం వేస్తోంది. తాను ఇక్కడకు వచ్చినట్లు మాటగా అయినా అన లేదు. ఇదేస్థానంలో శైలజ వుంటే అంతా కళ్ళకు కట్టినట్లు వర్ణించి మేం చూసే అవసరం లేకుండా చేసేది! ఇద్దరికీ ఎంతతేడా!

'ఆర్చెడాన్' చేరుకున్నాం. అప్పటికే మా పిక్నిక్ ట్రూపులో కొంతమంది తోటలో తిరుగుతున్నారు. ఇద్దరు లంబాడీ వనితలు కలుపుమొక్కలు తీసి బాగుచేస్తున్నారు. మా రాకను వింతగా

గమనిస్తూ ఏదోమాట్లాడుకుంటూ వాళ్ళలో వాళ్ళు ముసిముసిగా నవ్వుకొంటున్నారు.

లోపలకు వెళ్ళి ఇష్టమొచ్చినట్లు తిరిగాం. అక్కడ మొక్కల్ని చూస్తుంటే ఇన్ని రకరకాలని మళ్ళీ జన్మలో చూడగలమా? అనిపించింది. ప్రభుత్వం ఇక్కడ తీసుకుంటున్న శ్రద్ధ ఎంతైనా అభినందనీయం! ఒకవైపు బత్తాయి, నారింజ, నిమ్మచెట్లు; ఇంకొకవైపు లవంగిచెట్లు; మరొకమూల బనానాచెట్ల క్రింద ముచ్చటగా పెరుగుతున్న కాఫీ మొక్కలు ఎంతో అందంగా వున్నాయి. అక్కడ పెరిగిన గులాబీలు ముద్దుగా, ఆరోగ్యంగా అరచేతి పరిమాణంలో సొంపుగా వున్నాయి.

"చూశావా శైలజా! ప్రకృతిలో పెరిగిన ఈ గులాబీలు ఎంత బాగున్నాయో! మన ఇళ్ళల్లో పూసినవి ఇందులో సగంకూడా వుండవు," అన్నా.

ముద్దగా ఉన్న తెల్లగులాబీ వెన్నలాటి మంచుతో వింతగా ప్రకాశిస్తోంది.

"ఇంకేం! ప్రకృతి పరీక్షకూడా నన్నమాట!" శైలజ ఎగతాళి చేసింది.

తలొక పువ్వు కోసి పట్టుకొని బయలుదేరాం.

అర్చెడాస్ అంతా తిరిగి బయటకు వచ్చాం.

"అలా ముందుకు వెళ్దాం రండి!" అంది రాధిక.

"నాకు కొంచెం పనివుంది. కమల నాకోసం చూస్తూవుంటుంది. మీరు వెళ్ళండి;" అంది శైలజ. సుగుణ. ఫ్లొరెన్సు కూడా శైలజతో వెళ్ళిపోతామన్నారు.

నేనూ రాధికా ముందుకు బయల్దేరాం.

వెళ్ళటానికి వెనక్కు తిరుగుతూ అంది శైలజ "ఇద్దరూ ప్రకృతి ఆరాధికులే! సాయంత్రానికే వచ్చెయ్యండి ఒళ్లు మర్చిపోక."

నవ్వుకుంటూ సాగిపోయాం.

నాకు ఇప్పుడు అవకాశం లభించినట్లయింది.

"ఏం; రాధికా అదోలా వున్నావ్?" అన్నాను పాతప్రసక్తిని తెస్తూ.

రాధిక ఇటూ అటూ చూస్తూ ఏదో వెదుకుతున్నట్లు నడుస్తోంది.

"రాజీ! ఈ ప్రదేశం పాతజ్ఞాపకాల్ని తవ్విపోస్తోంది! అందరికీ సంతోషాన్నీ, శాంతినీ కల్గించే ఈ ప్రకృతి, ఈఅరకులోయ నా పాలిట నరకమైంది! ఎంత మర్చిపోదామనుకున్నా మరువకండా చేసింది."

నాకు ఆశ్చర్యం, ఆత్రుతా కలిగినమాట వాస్తవం.

ఏమిటో ఆ జ్ఞాపకాలు! రాధిక ఎంతో నిండుగా వుంటుంది.

"ఇక్కడ కూర్చుందామా?" అంది రాధిక.

సర్వేచెట్టు మొదట్లో కూర్చున్నాం.

"రాజీ! నా కథంతా వింటావా?



కొంపతీసి ఏ పత్రిక్కీ వ్రాసి పంపకు సుమీ!" అంది నవ్వుతూ రాధిక.

ఆ నవ్వులో జీవంలేదు। ఆ పెదాల్లో శిథిలమైన భావాలేవో గోచరించాయ్.

రాధిక ప్రారంభించింది.

*   *   *

"రాజీ! నేను చిన్నతనంలో కష్టాలు, బాధలు, అశాంతి మొదలైన పదాలకు

అర్థంకూడా తెలియకుండా పెరిగ్గాను. 'పెరిగాను' అనేకంటే అమ్మ, నాన్న నన్ను ఆలా పెంచారంటే బాగుంటుంది. నాన్నగారు వ్యాపారంలో లక్షలు ఆర్జించారు; నేనొక్కగా నొక్క కూతుర్ని! ఇంట్లో ఏపని జరిగినా నా ఇష్టంకోసం, నా సుఖంకోసమే! అలా గడిచిపోయింది నా చిన్నతనం. కల్మషం, కుతంత్రం తెలియని రోజులు — కలగా మాత్రం మిగిలిపోయాయి.

నాకు బాగా జ్ఞాపకం రాకముందే మా కుటుంబం ఏలూరులో స్థిరపడి పోయింది. నన్ను చిన్నతనంలో స్కూలుకు పంపకుండా 'టీచర్ని' రప్పించి ఇంటివద్దనే చదువు చెప్పించారు. నా 'మెట్రిక్' వరకూ విద్యా విధానం అలాగే గడిచిపోయింది. మెట్రిక్ ప్యాసయి అమ్మ వద్దంటున్నా వినకుండా కాలేజీలో చేర్పించారు నాన్న. అమ్మకు ఈ చదువులు, కాలేజీలు అంటే సుతిరామూ ఇష్టంలేదు, ఏదో పాడయి పోతానని భయం. ఇంటరు మొదటి సంవత్సరం హాయిగా గడిచిపోయింది. శెలవలు ఇచ్చేశారు, ఎండలు చాలా తీవ్రంగా వున్నాయి. అందువలన కొన్నాళ్లు అరకులోయ మొదలైన ప్రాంతాలన్నీ తిరిగివద్దామని నాన్నగారు 'టూరు' ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటు నాకుకూడా చాలా ఉత్సాహాన్ని, ఆనందాన్నికల్గించింది. కారులో మేమ్ముగ్గురం ఒక వంటవాడితో సహా బయలుదేరాం.

అదే, ఇల్లువదలి మొదటిసారిగా పై ప్రదేశాలు చూడటం. నాకు అంతా వింతగా, ఆనందంగావుంది. ఈ ప్రకృతి చూశాక అసలు ఏలూరు పోదామని అనిపించలేదు. మొదట మూడురోజులు విశాఖపట్నంలో గడిపి ఇక్కడకు చేరుకున్నాం. అప్పటికి ఇంకా ఇంతమంచి రోడ్లు, బంగళాలు, ఇవేమీ లేవు. అంతంత మాత్రంగా రోడ్డంటూ ఒకటి వుండేది. ఈ ఫల పరిశోధక కేంద్రం, పట్టు పరిశోధిక కేంద్రం ఇవేమీ లేవు. ఒకటి రెండు హోటళ్లు మాత్రం వుండేవి. జనాభాలో చాలాభాగం లంబాడీలే; చాలా తక్కువమంది తెలుగువాళ్లుండేవారు. ఇక్కడ చూడటానికి ప్రత్యేకంగా ఏమీ లేకపోయినా ప్రకృతితో కాలం గడిచిపోయేది. వచ్చిన మొదటి వారంలో మాచ్‌ఖండ్ మొదలైనప్రాంతాలుకూడా తిరిగి మిగిలినరోజులు ఇక్కడే గడపటానికి నిశ్చయించుకొన్నాం.

ఇక్కడకు వచ్చిన పదవ రోజున అనుకుంటా, సాయంత్రం ఏమీ తోచక 'బుచ్చిబాబు' కథల పుస్తకం పట్టుకొని బయలుదేరాను. రోడ్ల ప్రక్కన వుండే చెట్లను చూస్తూ, పిట్టలు చేసే గానం వింటూ ప్రకృతిలో మైమరచి కొంత దూరం వెళ్ళాను. భానుడు తన విధి నిర్వర్తించి పశ్చిమాద్రి చేరుకుంటున్నాడు. కొంచెం దూరంలో ఒక చిన్న

యేరు కన్పించింది. ఒడ్డునే తెల్లటి ఫంట్లాం చొక్కా ధరించిన ఒక యువ కుడు కూర్చొని ఏదో చేస్తున్నాడు. అతన్ని చూస్తే ఎందుకో నాకు ఆశ్చర్యం కల్గింది. ధైర్యంచేసి దగ్గరగా వెళ్ళాను. వెనుకనించి చూస్తే అతను చేస్తున్న పని అర్ధమయింది. ప్రక్కనే రంగుల పెట్టె, రెండు కుంచెలు పడివున్నాయి. తను గీసిన చిత్రంలోకి తదేకంగా చూస్తున్నాడు. అతాని పరిస్థితి చూస్తే ఈ ప్రపంచంతో సంబంధం లేనివాడి లాగా అన్పించింది నాకు. ఎదురుగా గల గల పారుతున్న సెలయేరు, దూరాన పశ్చిమ కొండల్లో ఇంకిపోతున్న సూర్య భగవానుడు అతను గీసిన చిత్రంలో ప్రతిబింబిస్తున్నారు? ఆ చిత్రం చూస్తే 'ఎంత బాగా గీశాడు!' అన్పించింది.

ఏమి చెయ్యాలో తోచక నా సమీ పాన్ని చూచిస్తూ పొడిగా దగ్గాను! అతడు వెనుతిరిగి నన్ను చూసి గాభరాపడుతూ లేచి దూరంగా నించున్నాడు. అతని గాభరా చూస్తూంటే నాకు సిగ్గేసింది. నాకేసి అదోలా చూస్తూ "మీరు...!" అన్నాడు సందేహిస్తూ.

"సారీ! మీ ఏకాంతాన్ని పాడుచేసి నట్లున్నా! క్షమించండి. మీరు గీస్తున్న చిత్రం చాలా అద్భుతంగా వుంది. మీ పేరు?" చొరవచేసి మాట్లాడాను. ఎందుకో అతన్ని చూశాక మాట్లాడ టానికి భయం పోయింది.

"నాపేరు శేఖరం! ఇక్కడే పోస్టా ఫీసులోపని. అలా కూర్చోండి;" అతడు చేసే మర్యాదలు చూస్తే నవ్వొచ్చింది.

కొంచెం దూరంలో కూర్చుంటూ అన్నాను. "ఓ! అప్పుడప్పుడు పత్రి కల్లో 'శేఖర్' అని పడుతూవుంటాయి; ఆ చిత్రాలు మీవేనా?"

ఔనండీ!" అన్నాడు తలవంచుకొని.

అతని అవస్థ చూస్తే జాలేసింది." కూర్చోండి! మీరు అలా నిల్చుండి పోయారే!"

"ఆ! ఫర్వాలేదు లెండి."

"అయితే నేనూ లేచి నిల్చుంటా."

"అరే! భలేవారు మీరు. నేను కూర్చుంటాను లెండి!" అంటూ కొంచెం దూరంలో కూలబడ్డాడు.

"మీ చిత్రానికి మొన్న ప్రైజుకూడా వచ్చినట్లుంది!" అన్నా సాలోచనగా చూస్తూ.

"ఆ! ఏదో... లెండి!" సణిగాడు.

"మిమ్మల్ని కలుసుకొన్నందుకు చాలా సంతోషంగా వుంది!" అన్నాను.

"ఇంతకీ మీరు నాగురించి మాట్లాడ మేగాని మీ గురించి చెప్పలేదు," అన్నాడు నవ్వుతూ. నేను సిగ్గుపడుతూ నాగురించి పరిచయం చేసుకున్నాను.

అలా అయ్యింది శేఖర్‌తో నా మొదటి పరిచయం. అతని చిత్రాలంటే అతన్ని చూడకముందునుంచీకూడా చాలా ఇష్టంగా వుండేవి. అతనితో పరిచయం

లభించాక వాటిపై నా గౌరవంపెరిగింది.

అమాయకంగా వుండే అతని ముఖం, చిన్న నోరు, మిలమిల మెరిసిపోయే కళ్ళు; ఒక్క ముక్కలో చెప్పాలంటే శేఖర్ చాలా అందగాడు. మంచితనానికి మారుపేరు అన్నట్లుగా వుండేవాడు. మధ్యతరగతి కుటుంబీకుడు. సంస్కారంగల వ్యక్తి. నేను అక్కడ వున్న మిగతా ఇరవై రోజులూ అతని సాంగత్యంలో ఇరవై క్షణాల్లా గడిచిపోయాయి. అతని మాటల్లో మృదుత్వం, చూపుల్లో లాలిత్యం నన్ను గిలిగింతలు పెట్టాయి. ఆ కొన్నిరోజుల సాంగత్యంలోనూ అతనికి పూర్తిగా వివశనయిపోయాను। మా ఇద్దరి మధ్యా మధుర భావాలు దోబూచులాడాయి. అతనికి అంతులేని ఆశలు కల్పించాను। అక్కడ నుంచి శేఖరాన్ని విడిచి రావటానికి నిర్వచించలేని బాధకల్గింది. అతడుకూడా మనస్సులో బాధ నంతటినీ దాచుకొని లేని నవ్వుతో వీడ్కోలిచ్చాడు.

ఏలూరు చేరుకున్నాం; మళ్ళీ అంతా మామూలే – కాలేజీలు, గొడవలు ఇత్యాదులు. ఏలూరు వచ్చిన వారంరోజుల వరకూ మనసు ఆ గోలా వుంది. అనుక్షణం శేఖరం గుర్తుకు వచ్చేవాడు. అతన్ని మరిచి చదువుమీద ధ్యాస మళ్ళిద్దామన్నా అది కష్టసాధ్యమే అయ్యింది.

శేఖర్ అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాసేవాడు. వాటికి మాత్రం నిర్లక్ష్యం చెయ్యకుండా జవాబులు వ్రాసేదాన్ని. అతని రాతల్లో అమృతాన్ని చిలికించేవాడు. నా ఉత్తరాన్ని చూసి ఏమనుకుంటాడో అనుకొని సిగ్గుపడేదాన్ని.

ఇంటరు పూర్తయ్యింది. సెలవల్లో నా జీవితంలో పెద్ద 'మలుపు' జరిగింది. అదే నా వివాహం. శేఖరాన్ని వివాహం చేసుకుంటానని నాన్నతో చెద్దామనుకున్నా. కాని ధైర్యం చాలలేదు. అటు నామీదనే ఆశలన్నీ నిలుపుకొన్న బావని కాదనలేకపోయాను. మానసిక సంఘర్షణని ఎదుర్కోలేకపోయాను. నా పిరికితనమే నన్ను సరిగా బ్రతకనివ్వకుండా, నాకు శాంతి, సుఖాలు లేకుండా చేసింది. నా పెళ్ళి శుభలేఖ శేఖరానికికూడా పంపించాను. దాని పరిణామాన్ని ఊహించలేకపోయాను. అతనివద్దనుండి ఉత్తరాలు రావటం ఆగిపోయాయి. అదీ ఒకవిధంగా మంచిదే అనుకున్నా. మనసు రాయి చేసుకొని కాలం గడపటం ప్రారంభించాను.

వివాహ మయ్యాక పది నెలలు దొర్లిపోయాయి. కాలక్రమేణా ఆయన ప్రేమలో శేఖర్‌ని మరిచిపోయాను. ఆయనకు నేనంటే ప్రాణం. ఆ పది నెలలు మా దాంపత్యం సుఖంగా సాగిపోయింది. కాని నేను ఆ విధంగా సుఖపడటం విధి చూడలేక కళ్ళల్లో నిప్పులు పోసుకొంది. నేను శేఖరానికి చేసిన అన్యాయానికి శిక్షను పొందాను. జీవితంలో మళ్ళీ కోలుకోలేని అఘాతం

తగిలింది. ట్రాంబేలో ఉంటున్న ఆయన బస్సు యాక్సిడెంటులో మరణించారు. నా కుంకుమ చెరిగిపోయింది. శేఖర్‌కి చేసిన అన్యాయం, ఆయన మరణం నన్ను దహించివేశాయి. ప్రకృతి ఎదురు తిరిగి వెక్కిరించింది. అంతే; జీవితం అంధకారమైపోయింది. నాన్న, అమ్మ పిచ్చెత్తేట్లయిపోయారు. ఇంటిదగ్గరే రెండేళ్ళు నిర్లిప్తంగా గడిపేశాను. కాని ఆ జీవితాన్ని కూడా సర్దుకుపోవటం చాలా కష్టమయిపోయింది. ఖాళీగా వుంటే ఏవో జ్ఞాపకాలు మనసును కలచి బాధను త్రవ్విపోసేవి.

అందువలననే నాన్నగారి మాట తీసెయ్యలేక 'మెడిసన్'లో చేరాను. ఈ నాలుగేళ్ళు యాంత్రికంగా గడిచిపోయాయి. మనసు దిటవు చేసుకొని చదువుతున్నా, ఒకొక్కక్క క్షణంలో ఏదైనా అఘాయిత్యానికి తలపెడతాను. కాని నేను అలాటి పని చేస్తే నాన్న, అమ్మ ఎంత నరకబాధకు గురిఅవుతారో తల్చుకొంటే భయంవేస్తుంది. తెలియని ధైర్యంతో, విశ్వాసంతో కాలం గడుపుతున్నా. కాని ఇప్పటికీ నా మనసులోని చింత ఒక్కటే: నా జీవితం ఎలాగా ఎడారి అయిపోయింది. కాని ఏ పాపం తెలియని అమాయకుణ్ణి, ఒక మంచివాణ్ణి బాధకు గురిచేశాను. శేఖరం నామీద ఎన్నో ఆశలు పెంచుకొని మనసు పాడుచేసుకున్నాడు.

నేను 'మెడిసన్'లో చేరే ముందు మళ్ళీ మామయ్యతో ఒకసారి ఇక్కడకు రావటం తటస్థించింది. అప్పుడు శేఖరం గురించి ఆరా తియ్యకుండా వుండలేకపోయాను. అతడు కనబడితే నా హృదయ మాలిన్యాన్ని కడుగుకొని క్షమాపణ చెప్పుకోవాలని ప్రయత్నించాను. ఎలాగో అతి కష్టంమీద శేఖరాన్ని చూశాను. కాని అతడు నన్ను గుర్తుపట్టగల స్థితిని ఏనాడో కోల్పోయాడు. మతి భ్రమించి పిచ్చివాడై తిరుగుతున్నాడు. నన్ను చూసి వెర్రిగా నవ్వి ముందుకు సాగిపోయాడు. ఆనవ్వులో అగ్నిపర్వతాలున్నాయి. మంచుశిఖరా లున్నాయి. నామీద పెంచుకొన్న కోపం, జుగుప్స, అసహ్యం వున్నాయి. 'నన్ను ఏంచేద్దామని మళ్ళి ఇక్కడకు వచ్చావ్?' అన్నట్లుంది ఆ నవ్వు. అతని పరిస్థితి చూస్తే నామీద నాకే అసహ్యం వేసింది. అతడు అలా అధోగతి పొందటానికి కారణం నేను. ఆ పాపిని నేను. నా పాపానికి నిష్కృతిలేదు. ఇలా కుళ్ళికుళ్ళి చావాల్సిందే. ఇదే నాకు సరియైన శిక్ష.

* * *

రాధిక కథ ముగించింది. ఆమె కన్నీటిలో ఆనకట్ట తెగిపోయింది. దుఃఖం ముంచుకొచ్చింది. ఒడిలో తలదాచుకొని భోరున ఏడ్చింది. ఆమెలో రగుల్కొనే దావాగ్నిని ఆ కన్నీరే మాత్రం ఆర్పలేదు.

ఆమె జీవితంలో ఎన్ని అనుభవాలు

చూసింది. ఆమె నిర్లిప్తతకు, నిరాడంబరత్వానికి ఇవే కారణా లన్నమాట.

ఆ పరిస్థితిలో ఆమె నెలాఓదార్చాలో, ఏం మాట్లాడాలో నాకు అర్థంకాలేదు.

"రాధికా! అనవసరంగా నీ గతాన్ని తవ్వి నీకు బాధ కల్గించాను. నన్ను క్షమించు. నువ్వు జీవితంలో ఎన్ని దెబ్బలు తిన్నావో. మొదట్లో నిన్ను సరిగా అర్థం చేసుకోలేక పోయాను. నీ ధైర్యానికి అభినందించకుండా ఉండలేక పోతున్నా. కాని ఒక్కమాట రాధికా! నువ్వు ఆత్మహత్యాప్రయత్నం మాత్రం ఎప్పుడూ తలపెట్టకు. నీ మీద ఆశలు పెంచుకొన్నవాళ్ళందరూ ఏమై పోవాలి? నామాటమీదేమాత్రంవిలవున్నా అదిమాత్రం కలలోనైనా తలవకు."

దీర్ఘంగా నిట్టూర్చాను.

గుబురుగా ఎండ వస్తోంది. టైము పదకొండున్నర కావొస్తోంది.

ఇద్దరం లేచి బయలుదేరాం. నడుస్తున్నా. నా మన్సు రాధికగురించే ఆలోచిస్తోంది. ఆమె కథ విన్నతరువాత కడుపులో ఎవరో కెలికిన ట్లయింది. రాధిక దేవతలాటి మనిషి ఈమెకేనా ఈ కష్టాలన్నీ! భగవంతుడు ఎందుకు ఇంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తాడు? అందాన్నంతటినీ తనలో ఇముడ్చుకొని లోకాన్నంతటికీ ఆనందాన్నిచ్చే ఈ అరకులోయ... ఈ ప్రకృతి సుందరేనా రాధిక బాధకు కారణమైంది. ఆలోచనతో బంగళా చేరుకున్నాం.

బంగళా ప్రక్కనేవున్న నూతిదగ్గర అందరూ గుమికూడి వున్నారు. నా మనసు ఎదో కీడుని శంకించింది. ఆ గుంపులోంచి శైలజ బయటకు వస్తూ అంది. "పాపం! ఎవరో పిచ్చివాడు! ఇందాకటివరకూ ఇక్కడే తిరిగాడు. ఉన్నట్టుండి నూతిలో దూకేశాడు. మన వంటవాడు వెంటనే నూతిలోకి దిగాడు. కాని లాభం లేకపోయింది."

రాధిక కంగారుగా తేరుకుంటూ ముందుకు పోయింది. అంతే; ఆ దృశ్యాన్ని చూసి స్పృహతప్పి పడపోయింది. త్వరితంగా బంగళాలోకి తీసుకొని వెళ్ళి సపర్యలు చేశాం. తెలివి రాలేదు. అక్కడ ఎవరో డాక్టరు ఉన్నారని తెలిసి వెంటనే పిలిపించాం. అయన వచ్చి ఇంజక్షన్ ఇచ్చాడు. సాయంత్రం తెలివి వచ్చింది. అప్పటివరకూ భయపడ్డ నాకు ఆమె కళ్ళు విప్పడంతో ధైర్యమొచ్చింది. తలదగ్గర నించొని అడిగాను: "ఎలావుంది రాధికా?" అని.

కాని జవాబు చెప్పలేదు. వెర్రి వెర్రిగా చూస్తోంది. ఏమో మాట్లాడింది.

నాకు ఏమీ అర్థం కావటంలేదు. మళ్ళీ డాక్టరువచ్చి పరీక్షించాడు.

"డాక్టర్! ఏమిటిదంతా?" అన్నాను.

"వెరీసారీ! 'మెంటల్'గా షాక్ తగిలింది. మతి కోల్పోయింది."

నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది. రాధికకు మతిభ్రమించింది ...రాధిక ... పిచ్చిది ...ఇక అలోచించలేకపోయాను.

శేఖరం ఈ లోకం వదలిపోతూ రాధికకు శిక్ష విధించిపోయాడు.